Happy Work Anniversary. 1St Year

షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 2 సంచిక : 157 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 22 ఏప్రిల్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 157 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thusday 22 April 2025 PAGES : 8 PRICE : 3/-

# పరిపాలన అంటే అర్థమదే..



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 21)


తమ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదని వ్యాఖ్యానించారు. రాబోయే అవకాశాలను కూడా అంచనా వేయగలగాలని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "సమగ్ర అభివృద్ధి అంటే దేశంలోని ఏ గ్రామం, కుటుంబం, ఒక్క పౌరుడు కూడా వెనకబడి ఉండకూడదని అర్థం. ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల వెయ్యేళ్ల భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతాయనడంలో సందేహం లేదు. దేశ యువత, రైతులు, మహిళల ఆకాంక్షలు నెరవేర్చుతూ ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉపయోగపడతాయి. వారి అసాధారణ ఆకాంక్షలు నెరవేర్చడానికి సాధారణంగా కృషి చేస్తే సరిపోదు. అంతే వేగంతో ప్రభుత్వం పని చేయాల్సి ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

**ఇది కీలకం..** "టెక్నాలజీ పరుగులు తీస్తున్న ఈ కాలంలో పరిపాలన అంటే వ్యవస్థలను నిర్వహించడం కాదు. కొత్త అవకాశాలు సృష్టించడం. పథకాలు ప్రజలపై ఎంత ప్రభావం చూపుతాయనేది కీలకం. దాని ఆధారంగా నాణ్యమైన పాలన కొనసాగించడం సాధ్యమవుతుంది. ఈ పదేళ్లలో భారత్‌లో ఎన్నో మార్పులు జరిగాయి. పాలన పారదర్శకత, ఆవిష్కరణ ఇలా ఎన్నో రంగాల్లో కొత్త మార్క్‌ను నెలకొల్పుతోంది" అని అన్నారు. "2023లో జీ20 భారత్ అతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. నాడు 'జనభాగిదారి' మిగతా 2లో

## పోప్ ఫ్రాన్సిస్ సందేశం స్ఫూర్తి దాయకం
## పోప్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది
### సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 21)

క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన వినయం, కరుణ, శాంతి సందేశం ద్వారా లక్షలాది మందికి స్ఫూర్తిని ఇచ్చిన ఆధ్యాత్మిక గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం తనకు చాలా బాధ కలిగించిందని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మానవాళిని ప్రేమ, దయతో నడిపించారని కొనియాడారు. శాంతి సందేశం ద్వారా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చారని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల తరఫున మిగతా 2లో



## ఏపీ హైకోర్టులో వల్లభనేని వంశీకి నిరాశ
స్థలం ఆక్రమణ కేసులో వంశీకి నిరాశ
కేసును వారంపాటు వాయిదా వేసిన హైకోర్టు
ఇప్పటికే విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 21)

స్థలం ఆక్రమణ కేసులో వైసీపీ నేత వల్లభనేని వంశీకి ఏపీ హైకోర్టులో నిరాశ ఎదురయింది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు ఈరోజు విచారించింది. కేసుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు మిగతా 2లో

## బిహార్‌లో 'ఐఐటీ విలేజ్'.. జేఈఈ మెయిన్‌లో 40 మందికి పైగా ఉత్తీర్ణత

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 21)

జేఈఈ మెయిన్ ఫలితాలు ఇటీవల వెల్లడైన సంగతి తెలిసిందే. 2,50,236 మంది కనీస కటాఫ్ పర్సంటైల్ స్కోర్ సాధించి.. జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అరత సాధించారు. ఈ అరత సాధించిన వారిలో 40 మందికి పైగా ఒకే గ్రామానికి చెందినవారు కావడం గమనార్హం. బిహార్‌లోని గయ జిల్లాలో 'ఐఐటీ విలేజ్'గా పేరుపొందిన పత్వాటోలీ నుంచి వారంతా ఉత్తీర్ణత సాధించడం దేశం దృష్టిని ఆకర్షించింది. వారిలో 28 మంది వృక్ష సంస్థాన్ కోచింగ్ సెంటర్ నుంచి శిక్షణ పొందినవారే. మిగతా 2లో




## పోప్ ఫ్రాన్సిస్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది
ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్న ఉప ముఖ్యమంత్రి
ఆయన మార్గదర్శకత్వం అందరికీ నిదర్శనమని వ్యాఖ్య
పోప్ ఫ్రాన్సిస్ బోధనలు ఎప్పటికీ నిలిచిపోతాయన్న కిషన్ రెడ్డి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 21)

పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫిబ్రవరిలో శ్వాసకోశ సమస్యతో ఆసుపత్రిలో చేరిన ఆయన, ఈస్టర్ సందర్భంగా చివరి సందేశం ఇచ్చారు. వాటికన్ సిటీలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు.ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచిన పోప్ ఫ్రాన్సిస్ మృతి తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గదర్శకత్వం, కరుణ, మానవత్వం అందరికీ ఆదర్శమని, ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. మిగతా 2లో



## హైకోర్టు ఆదేశాల ధిక్కరణ హైదరాబాద్ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
హైదరాబాద్ మురికివాడల కూల్చివేతపై
హైకోర్టు స్టే ఉల్లంఘన
అధికారిపై జస్టిస్ గవాయ్ ఘాటు వ్యాఖ్యలు
కోర్టు ధిక్కరణ కేసులో జైలులో ఉన్న
అధికారికి ఉపశమనం ఇచ్చేందుకు నిరాకరణ
అధికారి హోదా మారినా వైఖరి మారలేదని
సుప్రీం అసహనం



(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 21)

హైకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన హైదరాబాద్‌కు చెందిన ఓ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని మురికివాడలను కూల్చివేయవద్దని 2013లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సదరు అధికారి ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ ఘటనకు సంబంధించి కోర్టు ధిక్కరణ కేసులో జైలులో ఉన్న సదరు అధికారి, తనకు ఉపశమనం కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ తీవ్ర స్వరంతో స్పందించారు. మిగతా 2లో

## కొత్త పోప్ ను ఎలా ఎన్నుకుంటారో తెలుసా...?
పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం
తదుపరి పోప్ ఎవరన్నదానిపై సర్వత్రా ఆసక్తి
కొత్త పోప్ ఎన్నిక కోసం కీలకమైన ప్రక్రియ

(షణ్ముఖ వెలుగు, ఢిల్లీ, ఏప్రిల్ 21)

ప్రపంచ క్యాథలిక్ క్రైస్తవుల మత గురువు, పోప్ ఫ్రాన్సిస్ (88) సోమవారం ఉదయం కన్నుమూశారు. పోప్ మరణం తర్వాత వాటికన్ వ్యవహారాలను తాత్కాలికంగా పర్యవేక్షించే బాధ్యతలు కలిగిన 'కామెర్లెంగో' కార్డినల్ కెవిన్ ఫారెల్ ఈ విషయాన్ని ధృవీకరించారు."రోమ్ బిషప్ అయిన ఫ్రాన్సిస్ ఈ ఉదయం 7:35 గంటలకు పరమపిత వద్దకు తిరిగి వెళ్లారు. ఆయన తన జీవితమంతా భగవంతునికి, చర్చికి సేవ చేయడానికే అంకితం చేశారు," అని కార్డినల్ ఫారెల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సువార్త సందేశాన్ని ధైర్యంగా, కరుణతో, ముఖ్యంగా పేదలు మరియు అణగారిన వర్గాల పట్ల ఎలా జీవించాలో ఫ్రాన్సిస్ ప్రపంచానికి మార్గనిర్దేశం చేశారని ఆయన కొనియాడారు.పోప్ ఫ్రాన్సిస్ మరణంతో, క్యాథలిక్ చర్చి చరిత్రలో ఒక కీలకమైన పరివర్తన కాలం ప్రారంభమైంది. సంప్రదాయం ప్రకారం, తదుపరి పోప్ ఎన్నిక ప్రక్రియను కార్డినల్స్ కాలేజ్ పర్యవేక్షిస్తుంది. ఇందుకోసం అర్హులైన కార్డినల్స్ అందరూ రోమ్‌లో 'కాన్‌క్లేవ్' మిగతా 2లో



## పోప్ మృతి వార్త ఎంతగానో కలచివేసింది
పోప్ ఫ్రాన్సిస్ మృతిపై జగన్ స్పందన
సంతాప ప్రకటన విడుదల
క్రీస్తు విశ్వాసులపై చెరగని ముద్రవేశారని వెల్లడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 21)

క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చికి అధినేతగా విశేషమైన సేవలు అందించారని జగన్ కొనియాడారు. ఆయన హయాంలో చర్చి వ్యవస్థలో పరివర్తనాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచవ్యాప్తంగా మిగతా 2లో



## నేడు సిట్ విచారణకు హాజరవుతున్నా రాజ్ కసిరెడ్డి
ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు
ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి
ఇవాళ మరో ఆడియో సందేశం విడుదల
రేపు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల
మధ్య సిట్ కార్యాలయానికి వస్తానని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఏప్రిల్ 21)

ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన నేడు ఓ ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. రేపు (మంగళవారం) ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య సిట్ అధికారుల ముందు విచారణకు హాజరవుతానని వెల్లడించారు. అంతకుముందు, ఇదే కేసులో ముందస్తు బెయిల్ కోసం రాజ్ కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇటీవల ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ఆయనకు మధ్యంతర రక్షణ కల్పించడానికి నిరాకరించింది. ఆయన తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.కాగా, సిట్ అధికారులు గతంలో మూడు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా రాజ్ కసిరెడ్డి విచారణకు హాజరు కాలేదు. తాజాగా హైకోర్టులోనూ ఊరట లభించకపోవడం, కోర్టులో విచారణ ఆలస్యం అవుతుండడంతో ఆయన సిట్ ఎదుటకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.ఇటీవల ఇదే కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత విజయసాయిరెడ్డి సిట్ విచారణకు హాజరైన మిగతా 2లో

## మొదటి పేజీ తరువాయి

## పరిపాలన అంటే అర్థమదే..

విధానం ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చింది. యావత్ ప్రపంచ దృష్టి మన దేశంపై పడింది. కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాదు.. పలు కార్యక్రమాలను నడిపించే స్థాయికి మన దేశం చేరింది. అగ్రగామిగా నిలుస్తోంది. ఈసందర్భంగా సివిల్ సర్వెంట్లకు ఓ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నా. పేదల సమస్యలను ఓపిగ్గా వినండి. వారితో సున్నితంగా వ్యవహరించండి. వారిని గౌరవించండి. పేదల సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి" అని కోరారు.

## పోప్ ఫ్రాన్సిస్ సందేశం స్ఫూర్తి దాయకం

## పోప్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది

ప్రపంచ క్యాథలిక్ సమాజానికి తన సంతాపం తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఆధ్యాత్మిక నాయకత్వంలో తరతరాలకు పోప్ ఫ్రాన్సిస్ స్ఫూర్తిగా నిలిచారని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను స్పృశించారని మంత్రి పేర్కొన్నారు.

## ఏపీ హైకోర్టులో వల్లభనేని వంశీకి నిరాశ

తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో, కేసును హైకోర్టు వారంపాటు వాయిదా వేసింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి విజయవాడ జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీపై ఈ కేసుతో పాటు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు కూడా ఉన్నాయి. ఈ మూడు కేసుల్లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

## బిహార్‌లో 'ఐఐటీ విలేజ్'.. జేఈఈ మెయిన్‌లో 40 మందికి పైగా ఉత్తీర్ణత

పత్వాతోలీ ప్రత్యేకత ఏంటి..?

ఈ గ్రామం 'ఐఐటీ విలేజ్'గా పేరు పొందడానికి అసలు బీజం 1991లోనే పడింది. ఆ ఊరి నుంచి ఆ ఏడాది జితేంద్ర పత్వా ఐఐటీలో సీటు సంపాదించారు. ఆ ఘనత సాధించిన తొలి వ్యక్తి ఆయన. తర్వాత ఆయన కెరీర్ పరంగా ఎదిగి, యూఎస్‌లో నివసిస్తున్నారు. కానీ తన మూలాలను మర్చిపోకుండా మిగతావారు తనలాగే ఎదగాలని, ఇలి ఊనీలి ప్రనీబిదీవీలి% పేరిట ఒక ఎన్జీఓను స్థాపించారు. ఇక అప్పటినుంచి ఆ గ్రామంలోని ప్రతి ఇంట్లో ఐఐటీ పదం వినిపిస్తూనే ఉంది. 20వేల మంది గ్రామస్థులు ఉన్న పత్వాతోలీని గతంలో మాంచెస్టర్ ఆఫ్ బిహార్‌గా పిలిచేవారు. వస్త్ర పరిశ్రమలు, చేనేత పని చేసుకునేవాళ్లు ఎక్కువగా ఉండటంతో ఆ పేరు వచ్చింది. ఇప్పుడది ఇంజినీర్లకు నిలయంగా మారింది. ఇప్పటికీ అక్కడి కుటుంబాలు చేనేత పని మీదే ఆధారపడినప్పటికీ.. వారి పిల్లలు మాత్రం విద్యారంగంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారు. 2013లో ఏర్పాటైన వృక్ష సంస్థాన్.. ఐఐటీల్లో చదవాలనుకునేవారికి ఉచిత కోచింగ్ అందిస్తోంది. గ్రాడ్యుయేట్లు అందించే నిధులతో మెటీరియల్స్ ఇస్తోంది. దిల్లీ, ముంబయిలో నివసించే వారు ఆన్‌లైన్ వేదికగా విద్యార్థులకు కోచింగ్ ఇస్తుంటారు. "చాలా కుటుంబాల్లో తమ పిల్లలను పట్టణాలకు పంపించి చదవించలేని పరిస్థితి ఉంది. అందుకోసమే మేం వృక్ష వేద చెయిన్‌ను ప్రారంభించాం. ఒక లైబ్రరీ మోడల్‌ను ఏర్పాటుచేశాం" అని వృక్ష వేద చెయిన్ ప్రెసిడెంట్ దుబేశ్వర్ ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. పదో తరగతి దాటి చదవడమే కష్టమైన పరిస్థితులున్న ఆ గ్రామంలో బాలికలు ఉన్నత విద్యవైపు వెళ్లడానికి అవకాశాలు పెరిగాయి. ఇప్పుడు అక్కడ విద్యార్థులు నీట్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇక తాజాగా జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించిన వారిలో 28 మంది వృక్ష సంస్థాన్‌లో కోచింగ్ తీసుకున్నారు.

## పోప్ ఫ్రాన్సిస్ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది

ప్రపంచ క్రైస్తవ సమాజానికి పవన్ కల్యాణ్ సంతాపం తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు.

**ఆయన బోధనలు ఎప్పటికీ నిలిచిపోతాయి: కిషన్ రెడ్డి**

పోప్ ఫ్రాన్సిస్ మరణం తనకు చాలా బాధ కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శాంతి, ప్రేమ, కరుణ గురించి ఆయన బోధనలు ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రపంచ క్యాథలిక్ సమాజానికి సంతాపం తెలిపిన కిషన్ రెడ్డి, పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## కొత్త పోప్ ను ఎలా ఎన్నుకుంటారో తెలుసా...?

అనే రహస్య సమావేశంలో పాల్గొంటారు. శతాబ్దాలుగా ఇదే పద్ధతిలో కొత్త పోప్‌ను ఎన్నుకుంటున్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో 80 ఏళ్లలోపు వయసున్న కార్డినల్స్ మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. ఏప్రిల్ 2025 నాటికి, ఈ అర్హత కలిగిన కార్డినల్స్ సంఖ్య 137గా ఉంది. సాధారణంగా పోప్‌ను ఎన్నుకునే కార్డినల్స్ సంఖ్య 120 మించరాదని నియమం ఉన్నప్పటికీ, ఈ సంఖ్యను పెంచే విచక్షణాధికారం పోప్‌కు ఉంటుంది. ఈ చారిత్రాత్మక ఎన్నిక ప్రక్రియ రోమ్‌లోని సిస్టీన్ చాపెల్‌లో అత్యంత గోప్యంగా జరుగుతుంది. కాన్‌క్లేవ్‌లో పాల్గొనే ప్రతి కార్డినల్, సమావేశంలో చర్చించిన లేదా నిర్ణయించిన విషయాలను బయటపెట్టబోమని ప్రమాణం చేస్తారు. ఈ ప్రమాణాన్ని ఉల్లంఘిస్తే వారిని చర్చి నుంచి స్వయంచాలకంగా బహిష్కరిస్తారు. ఓటింగ్ ప్రక్రియలో భాగంగా, ప్రతి కార్డినల్ తమకు నచ్చిన అభ్యర్థి పేరును ఒక చీటీపై రాసి, దానిని ఒక ప్రత్యేక పాత్రలో వేస్తారు. అనంతరం ఓట్లను అందరి ముందు బిగ్గరగా చదివి లెక్కిస్తారు. ఒక అభ్యర్థి పోప్‌గా ఎన్నికవ్వాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ సాధించాల్సి ఉంటుంది. ఏ అభ్యర్థికీ అవసరమైన మెజారిటీ రాకపోతే, బ్యాలెట్ పత్రాలను కొన్ని రసాయనాలతో కలిపి నల్ల పొగ వచ్చేలా కాలుస్తారు. ఇది ఓటింగ్ విఫలమైందని, ఇంకా పోప్ ఎన్నిక కాలేదని సూచిస్తుంది. ఒకవేళ కొత్త పోప్ ఎన్నికైతే, తెల్ల పొగను విడుదల చేస్తారు. ఇది కొత్త పోప్ ఎన్నిక జరిగినట్లు ప్రపంచానికి సంకేతం. ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండేసి రౌండ్ల ఓటింగ్ జరుగుతుంది. ఎక్కువ కాలం ప్రతిష్టంభన కొనసాగితే, నిబంధనలను సడలించి సాధారణ మెజారిటీతో ఎన్నిక జరపడానికి అవకాశం ఉంది. కాన్‌క్లేవ్ ఎంతకాలం జరుగుతుందనేది కచ్చితంగా చెప్పలేం. చరిత్రలో కొన్ని గంటల్లో ముగిసిన సందర్భాలు (1503లో పోప్ జూలియస్ ఎన్నిక) ఉన్నాయి, అలాగే దాదాపు మూడేళ్లు పట్టిన కాన్‌క్లేవ్‌లు (1268-1271) కూడా ఉన్నాయి. అయితే, ఇటీవల 2005లో పోప్ బెనెడిక్ట్ , 2013లో పోప్ ఫ్రాన్సిస్‌లను ఎన్నుకున్న కాన్‌క్లేవ్‌లు ఒకటి లేదా రెండు రోజుల్లోనే ముగిశాయి. పోప్ ఫ్రాన్సిస్ మరణంతో క్యాథలిక్ చర్చి ఒక శకం ముగిసి, కొత్త నాయకత్వం కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది.

## నేడు సిట్ విచారణకు హాజరవుతున్నా రాజ్ కసిరెడ్డి

అనంతరం కూడా రాజ్ కసిరెడ్డి ఒక ఆడియో విడుదల చేశారు. తనపై విజయసాయిరెడ్డి ఆరోపణలు చేసినప్పటికీ, బెయిల్ పిటిషన్ కోర్టు పరిధిలో ఉన్నందున తాను స్పందించడం లేదని ఆ సందేశంలో పేర్కొన్నారు. త్వరలోనే విజయసాయిరెడ్డి బండారం బయటపెడతానని హెచ్చరించారు. ఇప్పుడు న్యాయస్థానంలో అనుకూల నిర్ణయం రాకపోవడంతో సిట్ విచారణను ఎదుర్కోవడానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

## పోప్ మృతి వార్త ఎంతగానో కలచివేసింది

కోట్లాది మంది క్రీస్తు విశ్వాసులపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎన్నికైన తొలి వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారని జగన్ కీర్తించారు. పోప్ ఫ్రాన్సిస్ కేవలం మత పెద్దగానే కాకుండా, ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారని వైఎస్ జగన్ అభివర్ణించారు. ప్రపంచ శాంతి కోసం... పేదలు, అణగారిన వర్గాల పట్ల కరుణ చూపడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని కొనియాడారు. ఆయన వినయం, మానవత్వం ప్రపంచాన్ని ఎంతగానో స్పృశించాయని పేర్కొన్నారు. శాంతి, కరుణ కోసం ఆయన గొంతుక ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు వైఎస్ జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచానికి, ముఖ్యంగా క్యాథలిక్ సమాజానికి ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.

## హైకోర్టు ఆదేశాల ధిక్కరణ హైదరాబాద్ అధికారిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

"కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడానికి ఏకంగా 80 మంది పోలీసులను తీసుకువెళతారా? మీరు ఉద్దేశపూర్వకంగానే కోర్టు ఆదేశాలను ధిక్కరించారా?" అని అధికారిని ఉద్దేశించి ధర్మాసనం ప్రశ్నించింది. హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులు అమల్లో ఉండగా మురికివాడలను ఎలా కూల్చివేశారని నిలదీసింది. "హైకోర్టు గౌరవాన్ని ఎవరైనా కించపరిస్తే... అలాంటి వారిని తక్షణమే అరెస్టు చేస్తాం. ఆయన హైకోర్టు కంటే గొప్పవారని భావిస్తున్నారా? చట్టాన్ని గౌరవించని వారికి ఎలాంటి రాయితీ ఉండదు" అని జస్టిస్ గవాయ్ హెచ్చరించారు. అధికారి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబ బాధ్యతలు ఉన్నాయని, 48 గంటలకు మించి జైలులో ఉంటే ఉద్యోగం కోల్పోతారని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం మరింత ఘాటుగా స్పందించింది. "మరి ఆయన కూల్చివేసిన ఇళ్లలోని పిల్లల గురించి ఆలోచించారా? ఆ పిల్లల సంగతేంటి? 2013 నాటి హైకోర్టు ఆదేశాలను ధిక్కరించేంత ధైర్యం ఆయనకు ఎక్కడిది?" అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. ప్రస్తుతం సదరు అధికారి రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్ డైరెక్టర్‌గా ఉన్నారని న్యాయవాది ప్రస్తావించగా, "అంటే ఇప్పుడు వీఐపీలకు స్వాగతం పలకడం, మురికివాడలను కూల్చివేసి రోడ్లు క్లియర్ చేయడం ఆయన పనా? ఆయన జైలులోనే ఉండి ప్రభుత్వ ఆతిథ్యం స్వీకరించాలి. లేదంటే ఆయన కూల్చివేసిన ఇళ్ల యజమానులకు భారీగా నష్టపరిహారం చెల్లించాలని మేం ఆదేశించగలం, లేదా ఆయన్ను మళ్లీ తహసీల్దార్‌గా డిమోట్ చేయగలం" అని జస్టిస్ గవాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ ఘాటు వ్యాఖ్యల అనంతరం, అధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

## విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

కదిరి పార్థసారథి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)






కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విద్యాభ్యాసంలో భాగంగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచనల మేరకు జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని సోమవారం కళాశాల సెక్రటరీ ,కరస్పాండెంట్ కదిరి పార్థసారథి ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం కదిరి పార్థసారథి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని విద్యార్థులను కోరారు. అదేవిధంగా వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమశిక్షణలో భాగంగా జాతీయ సేవా పథకం కింద వారం రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలు శీలంవారిపల్లి గ్రామంలో నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పంటలకు సంబంధించిన సలహాలు సూచనలు అధిక దిగుబడి సాధించడానికి తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా కళాశాల డీన్ డాక్టర్ వీరన్న గౌడ్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కళాశాలలో లాబ్స్ ఉన్నాయని రైతులు విత్తన శుద్ధి, నేలసారవంత పరీక్షలు నిర్వహించబడుతుందని రైతులు, గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు సేంద్రీయ ఎరువులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు గ్రామస్థులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, ఐ కార్ స్పెషల్ ఆఫీసర్, డాక్టర్ రామస్వామి, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు, మాజీ ఎంపిటిసి లు మురం కాశిరెడ్డి, మునగల నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ టి బాబురావు, స్కూల్ ఛైర్మెన్ యం మస్తాన్‌రెడ్డి, శీలం మాధవ, కొట్టే శ్రీనివాసులు, షేక్ నాయబ్ రసూల్, రోశయ్య, సుబ్బారెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంకుపాలెంలో పర్యటించిన ఎంపీడీవో డాక్టర్ సుజాత







(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 21)

మండలంలోని వెంకుపాలెం గ్రామంలో సోమవారం ఎంపీడీవో డాక్టర్ సుజాత పర్యటించారు. ముందుగా వేసవి కాలంలో పశువులకు నీటి తాకిడికి తట్టుకోవడానికి నీటి తొట్టెలను నిర్మించిన వాటిని ఆమె పరిశీలించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న పంచాయతీ ఆఫీస్‌ని, గ్రామంలోని సైడ్ కాలువలు లేకపోవడం ఆమె పరిశీలించారు. సుజాత మాట్లాడుతూ వీలైనంత త్వరగా గ్రామానికి సంబంధించిన పంచాయతీ ఆఫీసు అలాగే మురుగునీరు సాఫీగా సాగి పోవడానికి రోడ్డుకు ఇరువైపులా కాలవలు కట్టించేందుకు తగ చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, ఏపీవో సుధాకర్, టిఏ అనిల్, టిడిపి నాయకుడు మాదాల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

### మీ కోసం కార్యక్రమానికి 73 ఫిర్యాదులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

బాధితులు నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీ కోసం) కార్యక్రమమును జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన 73 ఫిర్యాదిదారుల అర్జీలను జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు స్వీకరించి వారితో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. అందిన ప్రతి ఫిర్యాదు గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రజా ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వెంటనే చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూ వివాదాలు, జాబ్ ఫ్రాడ్, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యల గురించి ప్రజా ఫిర్యాదులు వచ్చాయి.

**ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

ఒంగోలులో ఒక చిట్ ఫండ్స్‌లో ఒక వ్యక్తి నెలకు 10 వేల రూపాయలు చొప్పున డబ్బులు కంభంకు చెందిన ఏజెంట్‌కు, ఆన్లైన్ ద్వారా వారి చెప్పిన విధంగా 48 నెలలు కట్టించుకొని, చీటి పాట చివర్లో డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని బేస్తవారిపేట గ్రామానికి చెందిన గ్రామం, మండలం చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి విజయవాడకు చెందిన ఒక వ్యక్తి తన వద్ద నుండి రూ.3,60,000 డబ్బులు తీసుకొని మరొక వ్యక్తి ద్వారా తనకు ఫేక్ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి మోసం చేయడమే కాకుండా కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని చీమకుర్తి మండలం, కూనంనేని వారి పాలెంకు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. బోగోలు బిట్ర గుంట చెందిన ఒక వ్యక్తి పెద్ద దేవరం పాడు గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద నుండి గొర్రెలు మరియు కొదమ పిల్లలను నమ్మకంగా అమ్మి డబ్బులు ఇస్తానని చెప్పి గొర్రెలు, కొదమ పిల్లలను తీసుకొని రూ.4,50,000 డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పియస్ డిఎస్పీ రమణ కుమార్, మహిళా పియస్ సీఐ సుధాకర్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, సీఎస్ఎస్ ఇన్స్పెక్టర్ జగదీష్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐలు రజియా సుల్తాన్, ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.










## అంబులెన్సులను ప్రారంభించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

ఇంటర్‌రైజ్ సంస్థ వారు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు అందచేసిన 5 బీఎల్ఎస్ అంబులెన్సులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సోమవారం ప్రారంభించి వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించారు. ఈ అంబులెన్సులు సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్, టంగుటూరు టోల్ ప్లాజా, జాతీయ రహదారి (తరువాయి 4లో...)

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మే నెల 1న ఆత్మకూరులో సీఎం పర్యటన

**త్వరలో అధికారికంగా ఖరారు కానున్న సీఎం పర్యటన**
**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**
**అధికారులు సంసిద్ధంగా ఉండాలని మంత్రి ఆనం ఆదేశం**





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)

మే 1వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు ఆత్మకూరులో పర్యటించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఇప్పటికే సీఎం కార్యాలయం నుంచి తనకు ప్రాథమికంగా సమాచారం అందిందని, త్వరలోనే అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం పర్యటన కు ముందస్తుగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో ప్రాథమికంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేనెలా ఒకటిన ఆత్మకూరు సమీప గ్రామంలో పించన్ల పంపిణీ కార్యక్రమం, నారంపేట వద్ద ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కు ప్రారంభోత్సవం, పార్టీ కార్యకర్తలతో సమావేశంలో సీఎం పాల్గొంటారని ప్రాథమికంగా సమాచారం అందినట్టు మంత్రి చెప్పారు. సీఎం పర్యటనకు సంబంధించి అనువైన ప్రాంతాన్ని హెలిప్యాడ్ కోసం ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఆర్ అండ్ బి, రెవెన్యూ, పోలీసు, ఎలక్ట్రికల్, మున్సిపల్ శాఖల అధికారులు సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్వరలో సీఎం పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఖరారు కానున్నట్లు మంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఎస్ ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నాం

ఇప్పటివరకు అత్యధిక సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది
తెలుగుదేశం పార్టీ మాత్రమే
కూటమి ప్రభుత్వ హయాంలో
ఉద్యోగస్థులకు, ఉపాధ్యాయులకు సముచిత స్థానం
మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టిన పార్టీ వైసీపీ
రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్







(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 21)

ఎన్నికల హామీల్లో భాగంగా యువతకు ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక సార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన ఘనత కేవలం తెలుగుదేశం పార్టీకి మాత్రమే దక్కుతుందని మంత్రి స్పష్టం చేశారు. సంతమాగులూరు మండల పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సోమవారం ప్రారంభించారు. సవిటిపాలెం గ్రామంలో రూ. 10 లక్షల తో ఎన్టీఆర్ పార్క్ ను, మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు (తరువాయి 4లో...)

# ఎమ్ఎన్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన బాలినేని ప్రణీత్, ఇమ్మడి కాశీనాథ్

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 21)

భూదేవి సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో జనసేనపార్టీ కార్యాలయంలో గెట్ టూ గెదర్ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు, యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం జనసేన నాయకుడు బాలినేని అభిమాని, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎమ్ ఎన్ రెడ్డిని బాలినేని ప్రణీత్ రెడ్డి, ఇమ్మడి కాశీనాథ్ లు కలసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఇలా సన్మానించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. (తరువాయి 4లో...)





# వైభవంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి రథోత్సవం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఏప్రిల్ 21)


మార్కాపురం ఇలవేల్పు శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వామివారి రథోత్సవంలో పాల్గొని స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈ రథోత్సవానికి మార్కాపురం, చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి నామస్మరణ చేశారు. జై చెన్నకేశవ నినాదాలతో మార్కాపురం పట్టణం దద్దరిల్లింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ వారు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ వారు రథోత్సవం సక్రమంగా జరగడానికి తమ వంతు సహకారం అందించారు. (తరువాయి 4లో...)











# వైభవంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి రథోత్సవం











# అంబులెన్సులను ప్రారంభించిన కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

16 వారి ఎన్‌హెచ్‌ఏఐ మద్దతుతో అందించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం విద్యాసాగర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, ఎస్‌ఈఎల్ తరపున ప్రాజెక్ట్ హెడ్ కే శివ కుమార్, టీమ్ లీడర్ సురేష్ బాబు, సింహపురి సీఎస్ఆర్ కోఆర్డినేటర్ దండా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




# యువతకు ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నాం



చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రూ. 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ నిధులతో పాటు, కొందరు దాతల సాకారంతో సుమారు రూ. 78.17 లక్షలతో స్థానికంగా ఉన్న పాఠశాలలో 6 తరగతి గదులను ప్రారంభించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగస్థులకు, ఉపాధ్యాయులకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలాగా పెట్టిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఉపాధ్యాయ వృత్తిని అవమానించి ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేసారని మంత్రి పేర్కొన్నారు. సహచర మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లోని విద్యా వ్యవస్థ సరికొత్త రూపు దిద్దుకుంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా వ్యవస్థ బలోపేతానికి కావాల్సిన విధంగా నిధులు కేటాయిస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్య వ్యవస్థను నిర్లక్ష్యం చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. ఈ కారణంగా పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో మాత్రమే కాకుండా సిఎస్ఆర్ నిధులను కూడాను సమర్ధవంతంగా వినియోగించుకొని అద్దంకి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా నియోజవర్గంలోని విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా ఇటీవల కాలంలోనే దివ్యాంగులకు సుమారు 41 పైగా స్కూటీలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్ పరిమి కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హాజరయ్యారు. ఉపాధ్యాయునిగా కోటేశ్వరరావు విశేష సేవలు అందించినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఎంతో మందికి ఆయన ఆదర్శం అని చెప్పారు.

# హజ్ యాత్రికులకు వ్యాక్సిన్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

ఒంగోలు షాదీఖానాలో హజ్ యాత్రికులకు ఒంగోలు ఎమ్మెల్యే దామాచర్ల జనార్దన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిలు వాక్సిన్ కార్యక్రమం ప్రారంభించారు. ఆయన వెంట ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ షేక్ కఫిల్, జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, నాయకులు అమృల్లాహ్, అల్లబకాష్, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

**కంభం పట్టణంలో ముస్లిం జెఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ**





**(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 21)**

కంభం పట్టణంలో వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కందులాపురం కూడలిలో మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇతర ప్రజాసంఘాలు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు, ముస్లిం నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ముస్లిం లకు సంభందించిన అంశం అని దీనిలో కేంద్రప్రభుత్వం ముస్లిం సమాజానికి చెందిన వక్ఫ్ ఆస్తులను కాజేయాలని కుట్ర పన్నిందని, దీనికి కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి ముస్లింలకు ద్రోహం చేసిందన్నారు. ఇప్పటికైనా స్పందించి వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ కంభం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలతో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు భారీ ఎత్తులో పాల్గొని మద్దతు తెలిపారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 21)**

మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సోమవారం ఎంటి బి ఎస్తేర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తహసీల్దార్ వి.పుల్లారావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో పండించిన కూరగాయలు సాధారణంగా రసాయన పురుగుల మందులు, ఎరువులు లేక, సహజ పద్ధతిలో పండించినందున ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయని ఆయన అన్నారు. ఎంపీడీవో డాక్టర్



సుజాత మాట్లాడుతూ సేంద్రియ కూరగాయలు రసాయన అవశేషాలు ఉండవు కాబట్టి అవి ఆరోగ్యకరమైనవి రుచికరమైనవి అవి సహజంగానే పోషకాలు అధికంగా ఉంటాయి అని ఆమె అన్నారు. అనంతరం మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం నేల ఆరోగ్యానికి మెరుగుపరుస్తుంది ఎందుకంటే రసాయన ఎరువులు ఉపయోగించరు కాబట్టి పర్యావరణానికి మేలు చేస్తుంది. ఆర్గానిక్ కూరగాయలు జీర్ణక్రియకు సహాయపడుతుంది అని ఆయన అన్నారు. ఆర్గానిక్ కూరగాయలు సంబంధించి తహసిల్దార్ కార్యాలయం దగ్గర ప్రతి సోమవారం స్టాల్ పెట్టడం జరుగుతుందని ఎస్తర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుధీర్, మండల టిడిపి ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, ఎల్ 2 మందాకిని, నాగరాజు,మన్నెం మల్లికార్జున, బైరాగి, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# నెల్లూరులో హౌసింగ్ మాయాజాలం

**మోడీ సర్కార్ నిధులు దుర్వినియోగంపై ఏసీబీకి బిజెపి ఫిర్యాదు**
**తలుపులు ద్వారా బంధరాలు, కిటికీలు, కరెంటు సామాన్లు,**
**శానిటరీ సామాన్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డులలో నమోదు**
**ఏసీబీ డిఎస్పి శిరీషకు బిజెపి నేత మిడతల రమేష్ ఫిర్యాదు**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)**



నెల్లూరు లేఅవుట్ లోని ఫైనల్ బిల్లులు చేసిన ఇండ్లను తాము పరిశీలిస్తే ఒక్క ఇంటికి కూడా తలుపులు ,కిటికీలు, ఎలక్ట్రిఫికేషన్ శానిటేషన్‌లకు సంబంధించి 32,500 రూపాయలు విలువ చేసే సామాగ్రి ఏ ఇంట్లోనూ కనిపించలేదు. లబ్ధిదారులకు మాత్రం ఇచ్చినట్లుగా ఆన్లైన్లో నమోదు చేసి గృహ నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ల నుండి డబ్బులు వసూలు చేశారు. ఇదేవిధంగా జిల్లా లోని అన్ని లేఔట్లలో మెటీరియల్స్‌ను యధేచ్ఛగా దోచేశారు . కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలందరికీ లేఅవుట్ లలోనే గృహ నిర్మాణాలు చేపట్టవలసి ఉంది. నెల్లూరు అర్బన్ లో సొంత స్థలాలలో ఆప్షన్ త్రీ కింద వందల గృహాలు నిర్మించారు. జియో ఫెన్సింగ్ ఫోటోలలో కూడా మాయాజాలాన్ని ప్రదర్శించారు. 90 రోజులలో ఒక గృహాన్ని వివిధ స్టేజీలలో నిర్మాణాలు చేసి విడతల వారీగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. 90 రోజులకు బదులు 9 రోజులలో కొన్ని గృహాలు 6 రోజులలో కొన్ని గృహాలు 4 రోజులలో కొన్ని గృహాలు నిర్మించినట్లు జియో ఫెన్సింగ్ ఫోటోలు మాయ చేసి బిల్లులు చెల్లించారు. పాత ఇళ్లకు సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసి లేఅవుట్లలో గృహాలుగా బిల్లులు చెల్లించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు చేసిన అధికారులు ఒకరైతే ఆన్లైన్లో మాత్రం నెల్లూరులోనే విధులు నిర్వహించని అధికారులను బాధ్యులుగా ఆన్లైన్‌లో నమోదు చేశారు.అమరావతిలో మైక్రో ఇన్ఫర్మేషన్ సిస్టం (యం ఎస్ ఐ) ఒక ఆన్లైన్ గేమ్ లాగా యదేచ్ఛగా దోపిడీకి దుర్వినియోగం చేశారు. కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న సాంకేతిక పరిజ్ఞానం కంటే అవినీతి హౌసింగ్ అధికారుల వద్ద సాంకేతిక మాయా పరిజ్ఞానం పటిష్టంగా ఉంది. నిధులను దుర్వినియోగం బయటపడితే సంబంధం లేని అధికారులు బలి అయ్యేవిధంగా ఎం ఐ ఎస్ ను దుర్వినియోగం చేశారు. నెల్లూరులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విజిలెన్స్ అధికారులు నివేదిక ఇస్తే అవినీతి



అధికారులపై చర్యలు తీసుకోకుండా హెడ్ ఆఫీస్‌లో ఒక ఎస్సీ ఏడాది గడువు ఇచ్చి రికార్డులలో లబ్ధిదారుల సంతకాలు ఫోర్జరీ చేయించి అవినీతి అధికారులను కాపాడారు. హౌసింగ్ నిధులు దుర్వినియోగంపై విచారణ జరపాలని డిఎస్పి శిరీషకు రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందికట్ల రాజేశ్వరి పొట్లూరు శ్రీనివాసులు. యాకసరి ఫణి రాజు, రఘురామయ్య. చిత్తాతూరు పద్మవతి, కావటి శిరీష, ఏవి సుబ్బయ్య కరణం వెంకటరావు, కే భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినా, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యిందని సిపిఐ (ఎమ్.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టి పాటి వెంకటేశ్వర్లు తీవ్రంగా విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 176 హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ విడము ప్రకాశం జిల్లా కమిటీ ఒంగోలు కలెక్టరు కార్యాలయం ఎదుట సోమవారం భారీ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాను ఉద్దేశించి చిట్టి పాటి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రకటించిన నవ రత్నాలు శని గ్రహాలు అని విమర్శించిన చంద్రబాబు తాము మాత్రం మహారత్నాలు లాంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రభుత్వం చెప్పి వాటినీ నేటికీ అమలు చేయకపోవడం దుర్మార్గమైన విషయం అని విమర్శించారు. ప్రతి ఇంటిలో 19 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న మహిళకు ఆడ బిడ్డ పథకం కింద నెలకు 1500 రూపాయలు చొప్పున సంవత్సరానికి 18000 ఇస్తామని ఉమ్మడి ఎన్నికల ప్రణాళికలు హామీ ఇచ్చింది. ఈ పథకం అమలు జరగాలంటే 28,800 కోట్లు అవసరం కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఒక పైసా కూడా కేటాయించలేదని అన్నారు. బడ్జెట్ కేటాయింపులేకుండా ఈ పథకం అమలు చేస్తామని చెప్పడం వెనుక చంద్రబాబు మోస పూరిత విధానాలు ఇమిడి ఉన్నాయని విమర్శించారు. చంద్రబాబు ఎన్నికల్లో మాట్లాడుతూ "నేను గతంలో ప్రతి ఇంటికి దీపం పెట్టాను. ఆ దుర్మార్గుడు నేను పెట్టిన దీపాన్ని ఆర్పేశాడు ఇప్పుడు మరల ప్రతి ఇంట్లో దీపం వెలిగిస్తానని" చెప్పాడు. పేదింటి మహిళకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చాడు. రాష్ట్రంలో1,43,48,671 కార్డుదారులకు రాయితీ అందాల్సి ఉందన్నారు. దీనికి 4వేల కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం బడ్జెట్లో కేవలం 2800 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే 90 లక్షల మందికి శూన్య హస్తాలు చూపిస్తుందని విమర్శించారు. బడికి వెళ్లే ప్రతి బిడ్డ కోసం సంవత్సరానికి 15000 కేటాయిస్తామని ఎంతమంది పిల్లలు ఉంటే అన్ని 15000 కేటాయిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు తల్లి వందనం కింద 13 వేల కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం 9,000 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే ఇంకా 24 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది అని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అన్నదాత సుఖీభవ పథకాలు కూడా హామీ ఇచ్చారనీ, ప్రతి రైతుకు ప్రారంభ పెట్టుబడిగా 20,000 రూపాయలు కేటాయిస్తామనీ హామీ ఇచ్చి నేడు మాట మారుస్తున్నాడనీ విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలంటే 10,700 కోట్లు అవసరం కాగా, 25- 26 బడ్జెట్లో 6300 కోట్లు మాత్రమే కేటాయిస్తే మిగిలిన రైతాంగం పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. అలాగే కౌలు రైతుల రక్షణ చట్టం చేస్తామని కౌలు రైతులకు న్యాయం చేస్తామని మాట్లాడిన చంద్రబాబు ఆచరణలో వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడానికి కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. వైట్ బార్లీ, మిర్చి, వరి, సెనగ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి బి .పద్మ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలకి తోడు సున్నా వడ్డీ పథకం కింద మూడు నుండి పది లక్షల వరకు రుణాలు ఇస్తామని పేదలకు ఇళ్ల స్థలాలు పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని తదితర 176 రకాల హామీలు ఇచ్చారని ఏ ఒక్క హామీ అమలు చేయలేదని తీవ్రంగా మండిపడ్డారు. గత ప్రభుత్వం కాలంలో లక్షల కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిసి చంద్రబాబు ఆచరణ లో సాధ్యం కానీ సూపర్ సిక్స్ హామీలు ఎలా ఇస్తాడని ప్రశ్నించారు. గత ప్రభుత్వ వైఫల్యాలు మీద శ్వేత పత్రాలు విడుదల చేసి చేతులు దులుపుకోవడం తెలివైన పని కాదని విమర్శించారు. బెల్ట్ షాపులు నిరోధిస్తామని చెప్పిన చంద్రబాబు నేడు మద్యం పాలసీ తీసుకొచ్చి మద్యాన్ని ఏరులై పారిస్తూ గ్రామాల్లో బెల్ట్ షాపులు కూడా నిర్వహించడంతో ప్రతి సంవత్సరం 10 శాతం మంది కొత్తగా తాగుడుకు బానిస అవుతున్నారని విమర్శించారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు యల్ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సంపద సృష్టించి ఉద్యోగాలు కల్పిస్తానని 20 లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిష్కరించే బాధ్యతను తెలుగుదేశం తీసుకుంటుందని నాడు చెప్పి నేడు 10 నెలలు అవుతున్న కనీస నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, 3000 నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రగా మారుస్తానని చెప్పిన చంద్రబాబు నేడు రాష్ట్రాన్ని రుణాంధ్రప్రదేశ్‌గా మార్చాడని తీవ్రంగా విమర్శించారు. ఈ సభకు ముఖ్య వక్తగా హాజరైన చుండూరు రంగారావు మాట్లాడుతూ పాలకులు అధికారం రాకముందు ఒక మాట అధికారం లోకి వచ్చిన తర్వాత మరొక మాట మాట్లాడుతున్నారని ఇది విజ్ఞత కలిగిన వారికి సరైనది కాదని విమర్శించారు. ఎన్నికలు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా కేంద్రంలో నరేంద్ర మోడీకి కుడి ఎడమలు సపోర్ట్‌గా నిలబడ్డారని విమర్శించారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కె.నాంచార్లు అధ్యక్షత వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర కోశాధికారి ఎస్ భారతి, రాష్ట్ర నాయకులు వై.జానకి, జిల్లా కార్యదర్శి వి.మంజుల, సిహెచ్. పద్మ, సీతారామమ్మ,సుబ్బులమ్మ, యానాదమ్మ, వై విజయ, శ్రావణి, మణి, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు కొంగర నరసింహం, చంద్రశేఖర్, కోటేశ్వరమ్మ అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు జాలయ్య తిరుమలరావు నారాయణ, శ్యామ్, మోహనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలం వెల్లబుచ్చే వైనాన్ని అరుణోదయ కళాకారులు దృశ్యమాలిక ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఇది ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

## పదో తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 21)

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పదోతరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ప్రతి ఒక్కరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపల్ జి రాజేంద్ర బాబు తెలిపారు. కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపల్ బృందం మండలంలోని విరివిరిగా తిరుగుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు కళాశాలలో చేరాలని పోస్టర్లు ద్వారా, ఫ్లెక్సీలు దొర కాన్వాస్ చేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే విద్యార్థులకు అనుభవం గల అధ్యాపకులు చేత బోధన, విశాలవంతమైన తరగతి గదులు, విశాలవంతమైన ప్రయోగశాల, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, గ్రంథాలయం, విశాలవంతమైన క్రీడా మైదానం, అర్హులు గల విద్యార్థులకు తల్లికి వందనం, ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ, జాతీయ మరియు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనటకు ప్రత్యేక శిక్షణ వంటి సదుపాయాలు ఎన్నో ఉన్నాయని, అడ్మిషన్లు ప్రారంభమైన కావున పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండని, ప్రైవేటు కళాశాల దీటుగా మన కళాశాలలో మంచి మార్కులతో మన విద్యార్థులు ఉత్తీర్ణత పొందుతున్నారని అలాగే జిల్లాస్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కాటా మధురవాణి జిల్లా ఫస్ట్ వచ్చిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎస్.కె రషీద్, పీవీ విటల్, సిహెచ్ రవి, కే హరిబాబు, డాక్టర్ వై జాన్ బాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

## రావలకొల్లు గ్రామంలో పేకాట రాయుళ్లు అరెస్ట్

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 21)

మండలంలోని రావులకొల్లు గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసు బృందం సోమవారం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారని స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో పోలీస్ బృందం రెక్కీ నిర్వహించి పట్టుకొని వారి వద్ద నుంచి రూ.21,570ల నగదను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ అనుక్ తెలిపారు.

## కిల్కారి సేవలు గర్భిణికి వరాలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

జిల్లా వైద్య ,ఆరోగ్యశాఖ మీటింగ్ హాల్ ఒంగోలు నందు, జరిగిన ఆషా నోడల్ ఆఫీసర్స్ మీటింగ్ నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖఅధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆషా నోడల్ ఆఫీసర్స్ వారి పరిధిలోని ఆషా వర్కర్స్‌కు కేటాయించిన అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయవలసినదిగా ఆదేశించారు. ముఖ్యముగా మాత శిశు సంరక్షణ సేవలు అందించుటలో కీలక పాత్ర పోషించి మాతృమరణములను శిశు మరణాలను సంభవించుకుండా ప్రజలకు సరైన అవగాహనా కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా వడదెబ్బ మరణముల నివారించుటకు ప్రజలు పాటించవలసిన ముఖ్య నియములను తెలియచేసి ప్రతి ఆషా కార్యకర్త వద్ద ఓ.ఆర్.ఎస్. పేకెట్లను అందుబాటులో ఉంచుకోవాలేనన్ని ఆదేశించారు. ముఖ్యముగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కిల్కారి ప్రోగ్రాం ఆవశ్యకతను ప్రతి గర్భిణీస్త్రీకి, వారి కుటుంబ సభ్యులకు తెలియపరచి ఫోన్ ద్వారా కిల్కారి ప్రోగ్రాం వారు అందించే సూచనలను, సలహాలను విధిగా పాటించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను గర్భిణీ, బాలింతలకు ప్రవేశం పెట్టటం జరిగింది. గర్భిణీ 4వ నెల మొదలుకొని బిడ్డ సంవత్సరం వరకు కిల్కారి కాల్స్ వస్తాయి. వాయిస్ కాల్స్ వారినికి ఒక సారి వస్తాయి, వచ్చి తల్లీ, బిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారని అందచేస్తూది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660, ఈ కాల్ నెంబర్ ని గర్భిణీ మొబైల్ లో సేవ్ చేసుకున్నట్ల అయితే కాల్ వచ్చినపుడు ఎత్తి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారు. ఒక వేళ మరల తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి వినవచ్చు. ఈ కిల్కారి సేవలను గర్భిణీ, బాలింతలు ఉపయోగించుకోవాలని కిల్కారి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, కోరటం జరిగింది. ఈ కార్యక్రమం లో డాక్టర్ శ్రీవాణి జిల్లా టి.బి. లెప్రస, ఎయిడ్స్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం వారు కొత్తగా ప్రవేశపెట్టిన సి.వై.టీబీ. పరీక్షను ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేయుచున్న ఫ్రంట్ లిన్ వర్కర్ ప్రతి ఒక్కరు విధిగా చేయంచుకోవాలన్నారు. అందువలన ప్రాథమిక దశలోనే టిబి ని గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యకమంలో డాక్టర్ సౌజన్య డి.పి.యమ్.ఓ., డాక్టర్ వాణిశ్రీ, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఒంగోలు, సుగుణమ్మ డి.పి.హెచ్.యన్.ఓ రాజేశ్వరి, డి.సి.యమ్ డి శ్రీనివాసులు, జిల్లా మాస్ మీడియా అధికారి పాల్గొన్నారు.





## విశ్వమేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొనియాడిన పలువురు బీజేపీ నాయకులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)




డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భారతదేశానికే కాదు విశ్వానికే మార్గదర్శిగా దిక్సూచిగా ఉన్నారని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్ లోజిల్లా ఎస్సీ మోర్చా నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. జాతీయ యస్సీ మోర్చా కార్యదర్శి యస్.కుమార్ మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వాలు అనేక రకాలుగా,అనేక సమయాల్లో ఆయన్ను అవమానిస్తే, నేడు బీజేపీ నాటి వాజపేయి నుండి నేటి నరేంద్రమోడీ వరకు ఆయా గౌరవాన్ని పెంచుతున్నారని అన్నారు.పార్లమెంట్ లో నిలువెత్తు అంబేద్కర్ విగ్రహం ఇందుకు సాక్ష్యమన్నారు. బీజేపీ యస్సీ మొర్చా అధ్యక్షులు జి.దేవానంద్ మాట్లాడుతూ రాజ్యాం గానికి ఏదో జరుగుతుందని కాంగ్రెస్ దుష్ట శక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఎండగట్టారు. బీజేపీ నాయకులు, మాజీ ఎంఎల్ఏ దారా సాంబయ్య మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ ను అవమాన పరచిన నాటి కాంగ్రెస్ నాయకుల తీరు, వాస్తవాలను నేటి తరం తెలుసుకోవాలన్నారు.జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబా సాహెబ్ మనందరికీ ఆదర్శమని,ఆయన ఆశయాలను అమలు చేయడంలో ప్రధాని నరేంద్రమోడీ అనేక సంక్షేమ కార్యక్రమాలు తో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో యస్సీ మోర్చా రాష్ట్రనాయకులు మోజీ, జిల్లా అధ్యక్షులు పీ లక్ష్మణ్, డీ శివాజీ, పిచ్చయ్య, ఎం అమరసింహం, యోగయ్య యాదవ్, ఆర్ అజయ్, నాగేశ్వరరావు, వీర భద్రాచారి, బాలకోటయ్య, కొండవీటి విజయలక్ష్మి, పొద అపర్ణ, రమాదేవి, ఆశారావు, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో నెం. 4, 5

## వ్యవసాయ యాంత్రీకరణంకు ప్రభుత్వం పెద్ద పీట

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 21)

మండలంలో వ్యవసాయ యాంత్రీకరణ క్రింద రొటోవేటర్స్ 3, 9







చెక్కల గొర్రు 23, తైవాన్ స్ప్రేయర్ 13, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్ 5 మొత్తం 47 పరికరాలకి గాను 37 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా సోమవారం దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె బాలాజీ నాయక్ ద్వారా రైతులకి 9 పరికరాల చెక్కులను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షేక్ జైనులాబ్దీన్ మాట్లాడుతూ రైతులు అందరూ వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## చౌటపాలెంలో గ్రామీణ సురక్షిత నీటి కేంద్రంను ప్రారంభించిన కర్ణ, కోటిరెడ్డి, మండవ ప్రసాద్





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 21)



మండలంలోని చౌటపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా గ్రామీణ సురక్షిత నీటి కేంద్రమును,కర్ణ కోటిరెడ్డి మండవ ప్రసాద్ చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సురక్షిత నీటి కేంద్రం ఐటిసి లిమిటెడ్ అగ్రి బిజినెస్ వారి సౌజన్యంతో దాదాపుగా ఆరు లక్షల రూపాయలు సురక్షిత నీటి కేంద్రమునకు ఉపయోగించారని చౌటపాలెం టిడిపి నాయకుడు ఉన్నం శ్రీనయ్య తెలిపారు. అనంతరం మండల టిడిపి నాయకుడు కర్ణ కోటిరెడ్డి మాట్లాడుతూ చౌటపాలెంలో గ్రామీణ సురక్షిత నీటికేంద్రం ప్రారంభించడం వలన గ్రామంలోని ప్రతి ఒక్కరికి ఈ వేసవిలో తాగునీటి కొరత లేకుండా ఉంటుందని, దీనికి సహకరించినందుకు ఐటిసి వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చౌటపాలెం గ్రామ పంచాయతీని రిబ్బన్ కట్ చేసి పంచాయతీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాతూరు కోటయ్య, మండవ మురళి, ఉన్నం బాలకోటయ్య, గ్రామంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్యూటీలో ఉన్న కండక్టర్‌కు గుండెపోటు

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 21)

మండలంలోని ముత్తరాజు పాలెంకు సమీపంలో సోమవారం బస్సులో



ఉన్న కండక్టర్ ఏవీఎస్ లక్ష్మికు గుండెపోటు రావటంతో ప్రయాణికులు వెంటనే సిపిఆర్ చేస్తుండగా బస్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సు ఎక్కడ ఆపకుండా స్థానిక ప్రాథమిక వైద్యశాలకు తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కనిగిరి వైద్యశాలకు తరలించారు. ఈ బస్సు కనిగిరి నుండి కందుకూరుకి వెళ్లే సమయంలో ముత్తరాజు పాలెం వద్ద ఈ సంఘటన జరిగింది.

# ఉలవపాడులో ఘనంగా మాజీ మంత్రి మానుగుంట జన్మదిన వేడుకలు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 21)

మండల కేంద్రమైన ఉలవపాడు వినాయకుడి గుడి దగ్గర సోమవారం మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని మానుగుంట అభిమానులు అధిక సంఖ్య లో పాల్గొని కేక్ కటింగ్ కార్యక్రమం, అల్పాహార విందును ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రైతులుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలి

## సర్వేరెడ్డిపాలేం రైతులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్న బిజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ కళ్యాణ్ చక్రవర్తి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు వికసిత్ భారత్ లో భాగంగా అన్ని రంగాల ప్రజలను కలిసి వారికి ఉన్న ఇబ్బందులను తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి సోమవారం ఒంగోలు మండలంలోని సర్వేరెడ్డిపాలేం రైతులతో ముచ్చటించారు. ప్రకాశం జిల్లాలో ప్రధాన పంటలైన శనగ, పొగాకు రైతులతో మాట్లాడారు. పంటలు వేసేటప్పుడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పొగాకుకు, శనగ పంటకు ప్రస్తుతం ఉన్న గిట్టుబాటు ధర, వేలం జరుగుతున్న తీరు తదితర అంశాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పొగకు , శనగ రైతులకు మరింత గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు, బిజెపి రాష్ట్ర, కేంద్ర నాయకులతో మాట్లాడి రైతులుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలని బీజేపీ కూటమి సభ్యులు తరుపున కళ్యాణ్ చక్రవర్తి కోరారు. ఈ కార్యక్రమంలో కల్యాణ్ చక్రవర్తితో పాటు గ్రామ నాయకులు పుచ్చకాయల సుబ్బారావు, మక్కెన శ్రీనివాసులు, మక్కెన వెంకట్రావు, పుచ్చకాయల శ్రీనివాసులు, ముప్పా సుధాకర్ రావు, మందపల్లి వెంకటేశ్వర్లు, బిజెపి నాయకులు రాయపాటి అజయ్, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వ సరిదిద్దుతుంది

## మంత్రి లోకేష్ నాయకత్వంలో విద్యావ్యవస్థను గాడిలో పెడుతుంది ఏపీటీసీఏ సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

గత ప్రభుత్వం హయాంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చిన్నాభిన్నం అయ్యాయని ,ఆ ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్ది విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఏ పి టి సి ఏ నూతన అధ్యక్ష కార్యదర్శుల ప్రమాణ స్వీకారం, జనరల్ బాడీకి సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు పార్లమెంటు సభ్యులు హాజరయ్యారు. ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ అధ్యక్షులు పిడుగు జాలి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ఒంగోలు పట్టణంలో 160 జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వందల పాఠశాలలు ఉన్నాయని వీటన్నింటినీ మానిటరింగ్ చేసుకోవటం కత్తి మీద సాము లాంటిదని ఎమ్మెల్యే అన్నారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం పేద పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని కోరారు. గతంలో చంద్రబాబు నాయుడు పరిపాలన చేసినప్పుడు పదేళ్లకోసారి రిజిస్ట్రేషన్ ఉండేదని దాన్ని గత ప్రభుత్వం ఏడాదికి కుదించడం వల్ల చాలావరకు పాఠశాలలు మూసి వేయడం జరిగిందని అన్నారు. ప్రైవేటు ప్రభుత్వ విద్యను పరిరక్షించే విధంగా తమ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. కరెంటు చార్జీలో కూడా రాయితీ కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా 16,347 మందికి టీచర్ పోస్టులు ప్రకటించిందని, చెప్పిన విధంగానే డీఎస్సీని అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని అన్నారు. విద్య వ్యాపారం కాకూడదని సేవా దృక్పథంతో పేద పిల్లలకు కూడా సేవ చేయాలని వారు కోరారు. ఒంగోలు ఎంపీ మాగుట్ట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఏపీటీసీ ఏ తో తనకు అనుబంధం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. లోకేష్ బాబు విద్యాశాఖ మంత్రిగా అత్యద్భుతంగా పనిచేస్తున్నారని ప్రతి సమస్యలను సావధానంగా వింటూ వాటి పరిష్కారంకు కృషి చేస్తున్నాడని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు కరెంట్ విషయంలో టూ క్యాటగిరి నుండి ఏడవ కేటగిరీకి మార్చే విషయంలో కృషి చేస్తానని తెలిపారు. అలాగే టాక్స్ విషయంలో కూడా ముఖ్యమంత్రితో మాట్లాడి దానిని పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్య రాజు స్టేట్ ప్రెసిడెంట్ సుబ్రమణ్య రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యా సంస్థలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. గత ప్రభుత్వ నిరంకుశ విధానాల వల్ల ప్రతి ఏడాది వేలాది ప్రైవేట్ స్కూల్స్ మూతపడ్డాయని అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై మంత్రి నారా లోకేష్ వద్ద ప్రస్తావించామని వారు సావధానంగా అందరి సమస్యలు విని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాంటిసోరి ప్రకాష్ బాబు, హర్షిని విద్య సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు అజయ్ కుమార్, కె.శివకోటి రెడ్డిలకు నియామక పత్రాలు అందజేసి వారితో ప్రమాణం చేయించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాగుంట, దామచర్లలను ఘనంగా సత్కరించారు.










# కబ్జాలు, భూ దందాలపై ఉక్కుపాదం మోపనున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)

పేదలు రూపాయి రూపాయి కూడ పెట్టుకొని కొనుక్కున్న ఇల్లు, స్థలాలు, పొలాలు అధికారం ముందునో పలుకుబడి ఉందనో ఆక్రమిస్తే ఇక చూస్తూ ఊరుకునేది లేదు.కూటమి నాయకులైనా, వైసీపీ నాయకులైనా ఎవరికైనా ఉపేక్షించేది లేదని జనసేన నాయకులు కిషోర్ గురుకుల అన్నారు. గోమతి నగర్‌లోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చిన పలు సమస్యల విషయమై నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్చార్జి కమిషనర్ నందన్ ని కలిసి జనసేన పార్టీ జిల్లా నాయకులు కిషోర్ గునుకుల,నూనెమల్లికార్జున యాదవ్ పరిష్కరించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హౌస్ ఫర్ ఆల్ స్కీం కింద ఇచ్చిన ఆరంకణాల స్థలాలను కూడా కబ్జాదారుల ఆక్రమించి లబ్ధిదారులపై కాదు దాడులకు ఉపక్రమిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. 49వ డివిజన్లో తాగునీరు రంగు మారిన దుర్గంతో దుర్గంధంతో కూడిన వాటర్ మున్సిపల్ ట్యాప్‌లో వస్తుంది. సమస్యను అధికారులు దృష్టికి తీసుకు వెళ్తున్నా పరిష్కారం దొరకలేదని వెంటనే వాటిని సరి చేయాల్సిందిగా కోరారు. మెత్తుకూరు బస్టాండ్ సర్కిల్ నుండి చిల్డ్రన్స్ పార్క్ వైపు వెళ్లే కల్వర్టు కింద ఉన్న కాలువకి అటు ఇటు క్లీనింగ్ లేకపోవడం వల్ల చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది క్లీన్ చేయాల్సిందిగా తెలిపారు. ఏపీ టిట్కో హౌసెస్ విషయమై లబ్ధిదారులు లక్ష రూపాయలు కట్టి ఉన్న వారికి ఇంకా అలాట్ చేయని వారికి ఇల్లు పరిశీలించి త్వరగా కేటాయించాలని తెలిపారు. అదేవిధంగా డబ్బులు కట్టి ఎవరైతే వద్దు తమ డబ్బు వెనక్కి ఇవ్వాల్సిందిగా కోరారు. వాటిని రీఫండ్ చేయాలని కోరారు. జనవాణిలో వచ్చిన అనేక సమస్యలలో ప్రధానమైనవి భూకబ్జాలు,భూ ఆక్రమణలు వీటిపై పవన్ కళ్యాణ్ కూటమి తరఫున ఉక్కుపాదం మోపబోతున్నారు. ఇప్పటిదాకా అధికారం ఉందనో పలుకుబడి ఉందనో ఎంజాయ్ చేస్తున్న ఖబ్జాదారులు ఇకనైనా వారికి చెందని స్థలాన్ని అర్హులకు వదిలి వేయాల్సిందిగా మనవి చేశారు. సోషల్ మీడియాలో అభ్యూస్ చేసిన వారికి,గతంలో అవినీతి చేసిన వారికి చర్యలు ఏ విధంగా ఉన్నాయో దీనికి కూడా అదే విధంగా ఉంటాయన్నారు. కో ఆప్షన్ మెంబర్గా నూనె మల్లికార్జున యాదవ్ మంచి విషయాలు ఈరోజు కమిషనర్‌కి తెలిపారు. ట్యాంకులు ఏవైతే ఉన్నాయో అవి నిర్వహణ లేకపోవడంతో పాతవిగా శిధిలావస్థకు చేరుకుంటున్నాయి.వాటిని పరిశీలించి పునరుద్ధణ చేయవలసిందిగా కోరారు. నెల్లూరు రూరల్ అక్కచెరువుపాడ, కొండలపూడి గ్రామాలకు టిడ్కో హౌసెస్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు అంధకారంతో నిండిపోయింది.అక్కడ లైట్లు వేయించవలసిందిగా కోరడం వారికి సమాజం కున్న అవగాహన తెలుపుతుందన్నారు. కమీషనర్ స్పందించి పరిష్కార మార్గాలను చూపారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మాత్యులు పొంగూరు నారాయణ ,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి , అధికారుల సమన్వయంతో అభివృద్ధి పథంలో చూసుకో పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుగుల కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,42 డివిజన్ నాయకులు యాసిన్,16వ తేదీ నాయకులు నరహరి, అభిద్, తదితరులు పాల్గొన్నారు.





# కావలి వైసీపీ సీనియర్ నాయకులు దామిశెట్టి పార్థివదేహానికి నివాళు లర్పించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)

కావలిలో తన మిత్రుడు దామిశెట్టి సుదీర్ నాయుడు తండ్రి అయిన వైసీపీ సీనియర్ నాయకులు దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు మరణించడంతో వారి పార్థివ దేహానికి కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం నివాళు లర్పించారు. శ్రీనివాసులు నాయుడు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రశేఖర్ రెడ్డి భగవంతుని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీనివాసులు నాయుడు అంతిమయాత్రలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తో కలిసి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.




# శ్రీగిరిలో భక్తి శ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను గానం చేసారు. గాయకురాలు దీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు, భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే ఊరుకోను

## నిర్దిష్ట గడువులోగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

## అధికారులను హెచ్చరించిన జిల్లా కలెక్టర్ ఆనంద్

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)**

భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్ అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, డిఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డిపివో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సిఇవో విద్యారమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారుప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై ఆయాశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు.

**అర్జీదారులకు మంచినీరు, భోజన వసతి ఏర్పాట్లపై విశేష స్పందన**

ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులకు కలెక్టర్ మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించడం పట్ల విశేష స్పందన లభిస్తోంది. గత మూడురోజులుగా ఎండ తీవ్రత పెరిగిన దృష్ట్యా సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారులకు మంచినీరు, భోజన సదుపాయాలు ఊరటనిచ్చాయి. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.





**మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి**

ఉమ్మడి నెల్లూరుజిల్లా వాకాడుకు చెందిన మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని నెల్లూరు నగరంలో ఏద్కెనా కూడలిలో ఏర్పాటుచేయుటకు అనుమతిని ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ పార్టీ నేతలు అర్జీని అందజేశారు. రాజ్యసభ, పార్లమెంటు, శాసనసభ, శాసనమండలి నాలుగు చట్టసభలకు ప్రాతినిథ్యం వహించిన ఏకైక నెల్లూరు రాజకీయవేత్త, ఆంధ్రప్రదేశ్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన గొప్పనేత నేదురుమల్లి అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఆయన స్మృత్యార్థం నెల్లూరుసిటీ పరిధిలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే, కాంగ్రెస్ పార్టీ సొంతఖర్చులతో విగ్రహాన్ని ఏర్పాటుచేస్తుందని కాంగ్రెస్ నేతలు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


# దళితులను బహిష్కరణ చేయటం సిగ్గుచేటు

### కంప్యూటర్ కాలంలో ఇదేం చర్య

### పిఠాపురం మండలంలోని మల్లంలో ఘటన

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

మానవుడు నింగికి నిచ్చెన వేస్తున్న కాలంలో కొంతమంది నిచ్చెన మెట్ల వ్యవస్థను కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పిఠాపురంలో కుల అహంకారం కోరలు చాచడంతో దళితులు గ్రామ బహిష్కరణకు గురయ్యారు. కాకినాడ జిల్లా "పిఠాపురం మండలం, మల్లం గ్రామంలో" దళితులపై గ్రామ బహిష్కరణ విధిస్తూ అగ్రవర్ణాల కుల పెద్దలు హుకుం జారీ చేశారు. గ్రామంలో ఉన్న షాపులు, హోటళ్లలో ఏ విధమైన వస్తువులను దళితులకు విక్రయించొద్దని పరిష్కరించడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని




దీనిపై వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి ప్రభుత్వం పైన రాజ్యాంగం పైన ప్రతి ఒక్కరికి నమ్మకం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని " మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు డిమాండ్ చేశారు. ఈనెల 16న గ్రామంలో అగ్రవర్ణానికి చెందిన వారి ఇంటి దగ్గర కరెంటు పని చేస్తూ విద్యుత్ ఘాతానికి గురై పల్లపు సురేష్ అనే వ్యక్తి మృతి చెందాడు. పల్లపు సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ మల్లం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు ధర్నా చేశారు. చనిపోయిన వ్యక్తికి, నష్టపరిహారం చెల్లించమంటే, దళితులను ఊరికి దూరంగా పెట్టాలనుకోవడం అనాగరికమైన చర్య అని దీనిపైన వెంటనే సంబంధిత వ్యక్తులపై ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ ఆక్ట్ నమోదు చేసి భవిష్యత్తులో ఎలాంటి రాష్ట్రంలో దుచర్యలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అశోక్ బాబు డిమాండ్ చేశారు. వారికి ఏ విధమైన వస్తువులను విక్రయించరాదంటూ అగ్రవర్ణాలు తీర్మానించాయి. ఆదేశాలు పాటించని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యాపారులకు హెచ్చరించారు. దీంతో దళితులకు ఏ విధమైన వస్తువులను, తినుబండారాలను అమ్మకుండా షాపులు యజమానులు అమానుషంగా దీని మీద వెంటనే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్పందించాలని తెలిపారు.

# కాకాని గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు

## వైసీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)**

నెల్లూరు నగరంలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డిని అక్రమ కేసులు పెట్టి అరెస్టు వారిని తీసుకొని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. కూటమి నేతలు తమ పలుకుబడిన ఉపయోగించి కోర్టులో బెయిల్ కూడా రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు పాలన అందించడం మానేసి వైఎస్ఆర్ సీపీ నాయకులను అక్రమ కేసులతో వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కాకాని గోవర్ధన్ రెడ్డి రైతుల సమస్యల పైన, ఫీజు రియంబర్స్మెంట్ , ఇతర ప్రజా సమస్యలపై బలంగా తన గొంతు వినిపిస్తున్నాడని ఆయనపై అక్రమ కేసులు పెట్టడం జరిగింది. ఇదేవిధంగా ప్రతి ఒక్కరు గొంతు నొక్కాలని కూటమి నాయకులు పనిగా పెట్టుకున్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. మా అన్న మేకపాటి రాజమోహన్ రెడ్డి మొదటిసారి ఉదయగిరి శాసనసభ్యునిగా ఎన్నికైన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఎమ్మెల్యే అంటే రాజమోహన్ రెడ్డి లా ఉండాలని మెచ్చుకున్నారు. పార్టీలు చూడకుండా ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న మా అన్నను తెలుగుదేశం ముఖ్యమంత్రిగా ఉన్న రామారావు మెచ్చుకోవడం జరిగింది. అటువంటి రాజకీయాలను వదిలేసి ఎదుటి పార్టీ వ్యక్తులను ఇబ్బంది పెట్టడం పనిగా పెట్టుకుని ఇప్పుడు చంద్రబాబు ప్రవర్తిస్తున్నారు. ఎన్నికల ముందు అలివి గాని హామీలతో మేనిఫెస్టో ప్రకటించి, సూపర్ సిక్స్ పథకాలను టు ప్రజలును నమ్మించి అధికారం చేపట్టిన చంద్రబాబు గెలిచిన తర్వాత సూపర్ సెక్స్ పథకాలు ఏవయ్యా అంటే ఆకాశం వైపు చూసి పథకాలు ఎలా అమలు చేయాలో అర్థం కావడం లేదు, భయం వేస్తుంది చెప్తున్నారు తప్ప ఇచ్చిన హామీలను నెరవేర్చే ఆలోచన చేయడం లేదు. చంద్రబాబు ప్రజలనే కాకుండా కుటుంబ సభ్యులను కూడా మోసం చేసిన వ్యక్తి, రామారావు కుటుంబ సభ్యులను ఎలా మోసం చేశాడో, దూరం పెట్టాడో మనం చూశామన్నారు. చంద్రబాబు 2014 - 19 మధ్యలో నేను చెప్పిన హామీలు ఏవి నెరవేర్చకపోయినా మళ్లీ నన్ను ఇప్పుడు నన్ను ఓటేశారు కదా అని ఆలోచనలో ఉన్నాడు. ఆయన ఇచ్చిన హామీలు నమ్మి మనిషి ఎంతో కొంత మారి ఉంటాడు అనే ఉద్దేశంతో ఓట్లు వేసి గెలిపించుకొని ముఖ్యమంత్రి చేసుకున్నందుకు ఈరోజు ఈ శిక్ష అనుభవిస్తున్నాం. ఇంకో నాలుగు సంవత్సరాలు అనుభవించాల్సిందే కానీ ఇప్పటినుండి అయినా ఆయన మాది ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే, ఇదేవిధంగా అక్రమ కేసులు, గొడవలు చేస్తూ అందరిని భయపెట్టాలనుకుంటే కుదరదు. ఇప్పటికైనా ఆయన మారి సరైన పాలన చేస్తాను ఆశిస్తున్నామన్నారు.



# ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం పై అవగాహన కలిగి ఉండాలి

### ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు

### జులైలో భారత రాజ్యాంగం కనీస అవగాహనపై వక్తృత్వ పోటీలు

### రాజ్యాంగానికి సంబంధించి పాఠశాలల్లో పలు పుస్తకాల పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు పేర్కొన్నారు. జూలై మాసంలో విద్యార్థులకు, యువతకు భారత రాజ్యాంగం కనీస అవగాహన అనే అంశంపై ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక, ఓపిడి ఆర్ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే వక్తృత్వము పోటీలకు జిల్లాలోని కొన్ని పాఠశాల విద్యార్థులను, యువతను సమయత్తం చేసేందుకు పలు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి పేరయ్య, ఓపిజిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, యువజన నాయకులు భీమవరపు సుబ్బారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు బృందం ఒంగోలులోని పాఠశాల ప్రధానోపాధ్యాయులను కలిసి పలు పుస్తకాలను అందజేశారు. ఒంగోలులోని బండ్లమిట్ట సెంటర్లో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల అదే అన్నా ఉపాధ్యాయులు జి కృష్ణకుమారి, సోషల్ ఉపాధ్యాయులు డి.చంద్రశేఖర్, కోర్ట్ సెంటర్లోని రవీంద్ర భారతి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మి రాజ్, సోషల్ టీచర్ డి మల్లికార్జునరావు, భాష్యం స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.వి రమణారావు, రామ్‌నగర్‌లోని మునిసిపల్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ములుకుట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ,ఎంఎస్ శ్రావణి, సోషల్ ఉపాధ్యాయులు వై ఏడుకొండలు, ఆర్ మల్లికార్జున రావు, తెలుగు ఉపాధ్యాయులు కె.మోహన వంశీ, సిహెచ్ అనంతలక్ష్మి లను కలిసి సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక ప్రచురణ భారత రాజ్యాంగం కనీస అవగాహన, రాజ్యాంగ నిర్మాణ సభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 3 చారిత్రక ఉపన్యాసాలు, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ రచించిన భారత రాజ్యాంగ పీఠిక పుస్తకాల చెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులను కాపాడుకునేందుకు రాజ్యాంగంపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంపై ప్రజలలో కనీస అవగాహన కల్పించేందుకు ఈ వక్తృత్వ పోటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, యువతకు రెండు విభాగాలలో నిర్వహించే ఈ పోటీలలో విజేతలకు నగదు బహుమతి పాటు, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని విద్యార్థులు, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# నూతన బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మార్కాపురం డిపోకు చెందిన 2 అల్ట్రా డీలక్స్ బస్సులు, 2 ఎక్స్ప్రెస్ బస్సులను మొత్తంగా 4 నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారు స్వయంగా బస్సును నడిపి అందరిని ఉత్సహ పరిచారు. అంతకుముందు కంట్రోల్ రూంలో డిపో మేనేజర్, సిబ్బందితో సమావేశమై డిపోలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# సరైన ధ్రువపత్రాలు లేని ఆటోలకు చలానా




**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాలతో ట్రక్టర్లు డోరు తెరిచి అధిక కూలీలతో వెళుతున్న సరైన ధ్రువపత్రాలు లేని ఆటోలకు పలు మోటార్ సైకిళ్లకు కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ చలానాలు విధించారు. ఆటోలో పరిమితికి మించి జనాల్ని ఎక్కించిన ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్న వారికి వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆటో వాళ్ళు పరిమితికి మించి జనాన్ని ఎక్కించుకోకూడదని జాగ్రత్తగా ఆటోలో ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చాలని ఆటో డ్రైవర్లకి తెలిపారు.

# జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే 2024




**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)**

స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో 23 వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టి.శ్రీకాంత్ డీఆర్‌డీవో, సీనియర్ సైంటిస్ట్, జార్జి ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ నిర్వహించిన గౌరవ వందనాన్ని అయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన 2021 అడ్మిటెడ్ బ్యాచ్‌కి గ్రాడ్యుయేట్ పత్రాలు అందజేశారు. ముఖ్య అతిథి టి.శ్రీకాంత్ కీ నోట్ అడ్రస్ మాట్లాడుతూ బీటెక్ అనేది భవిష్యత్తు జీవన ప్రగతికి మూలమని మార్కులు క్రమశిక్షణ అలవాట్లు, కష్టపడే తత్వం సహజ లక్షణాలు, ఫార్చ్యూన్ అనేవి విజయానికి 5 మూల స్తంభాలాట అన్నారు. క్రమశిక్షణ అనేది మానసిక ధైర్యాన్ని తైర్యాన్నిస్తుందని ప్రతి విద్యార్థి నువ్వేం చేయాలనుకుంటున్నావో దానిని ప్లాన్ చేసుకోవాలని విద్యార్థులకు తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉందని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.మస్తానయ్య, వివిధ విభాగాధి పతులు, అకడమిక్ కౌన్సిల్ పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు








**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రకాశం జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి త్రాగునీరు అందించటం అభినందనీయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావులు పేర్కొన్నారు. రామ్ నగర్ మొదటి లైన్ లోనే వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కాపు సంఘం సేవా కార్యక్రమాలలో ముందుంటుందని వేసవిలో ప్రజలకుకావాల్సింది మంచినీరు మజ్జిగ అని అట్లాంటి కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని వారు ఆకాంక్షించారు. వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ సంజీవరావు తంజావూరు శ్రీనివాసరావు, అయినా బత్తిన గోపి శ్రీనివాసరావు, రాంబాబు ,సాంబయ్య ,నరసింహారావు,వాసాల సీతారామరాజు, బండారు మదన్, కాపు సంఘ నేతలు పాల్గొన్నారు.

## పార్కువీధి పాఠశాలలో ఫేర్‌వెల్ సంబరాలు



**(షణ్ముఖ వెలుగు, కంభం, ఏప్రిల్ 21)**

స్థానిక పార్క్ వీధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం వార్షికోత్సవ, వీడ్కోలు వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాల్యాద్రి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు రహమత్ సేవలు ప్రశంసనీయమని, గత 3 నెలలుగా దాతల సహకారంతో, బ్రాండెడ్ సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాలను నిర్వహించడం, పాఠశాల విద్యార్థుల పట్ల ప్రధానోపాధ్యాయుని ప్రేమకు, నిబద్ధతకు నిదర్శనమన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలను,పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి సాటిలేని సేవలందించిన ఉపాధ్యాయురాలు అమినాభి ఉపాధ్యాయుడు హాబీబుర్ రహమాన్ సేవలను గుర్తుచేస్తూ, ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు,ఆట పాటలతో అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ పి.అంజలి, సభ్యులు, తల్లిదండ్రులు,రిటైర్డ్ హెడ్మాస్టర్ రసూల్ బేగ్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణ, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ చిన్ని.పద్మావతీదేవి,లక్ష్మీ ప్రసన్న,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మౌలానా ముస్తాక్ అహ్మద్‌ని కలిసిన ముస్లిం మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ కరీం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 21)**

జిల్లా ముస్లిం మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ కరీం సోమవారం ఏపీ స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి ఉలవపాడు మండల ముస్లింల సమస్యల గురించి చర్చించారు.



## మల్లం గ్రామ దళితులను

# బహిష్కరణ చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

### దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఏప్రిల్ 21)**



పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామానికి చెందిన దళిత కుటుంబం సాంఘిక బహిష్కరణ చేయడం ఏమిటని ప్రజాస్వామ్య దేశమంటూనే కూటమి ప్రభుత్వం, పవన్ కళ్యాణ్ స్పందించాలని ప్రకాశం జిల్లా దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్ష కార్యదర్శులు పూర్ణకంఠ తిరుమలయ్య, పందిటి మోహన్ అన్నారు.ఆ గ్రామంలో రెండు రోజులు పాటు జరుగుతున్న మల్లం గ్రామానికి చెందిన ఒక అగ్రకులం వారి ఇంట్లో పల్లపు సురేష్ బాబు విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందడం జరిగింది. దానిపై ఇరు వర్గాల పెద్దలు కూర్చుని కుటుంబానికి 2లక్షల 75000 సహాయం చేయాలని నిర్ణయించడం జరిగింది. మమ్మలనే నష్టపరిహారం అడిగారనే ధోరణిలో అగ్రకులాల పెద్దలందరూ దళిత కుటుంబాలందరినీ సాంఘిక బహిష్కరించాలనేది నిర్ణయించుకుని గ్రామంలో ఉన్న దళితులకు పాలు తాగే చంటి పిల్లల సైతం పాలు ఇవ్వద్దని, టిఫిన్ సెంటర్ టిఫిన్లు వారికి అమ్మకూడదని, కిరణా వ్యాపారుల కిరాణా ఇవ్వకూడదని, చివరకు బయట నుండి వచ్చే చేపల గంపల్ని కూడా వెనక పంపడం జరిగిందని ఇది అవమానియా ఘటననివారు అన్నారు. దీనిపై నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలని, అంతేకాకుండా భవిష్యత్తులో ఇలాంటి సాంఘిక బహిష్కరణ ఘటనలు జరగకుండా చూడవలసిన బాధ్యత ఆయనకే ఉందని అన్నారు. ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సును అమలు చేయాలని వారు కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాలుగా ఎన్నో ఆందోళన చేస్తున్న ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పథకాల అమలు జరిగి ఉండుంటే ఈరోజు పల్లపు సురేష్ భవన నిర్మాణ కార్మికుడు ఎలక్ట్రిషన్కు 5 లక్షల ఆర్థిక సహాయం అందేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చంద్రన్న బీమా పథకం ద్వారా సురేష్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

# శ్రీ సరస్వతీ విద్యా సంస్థల అధినేత ఏవి కుమారులను అరెస్టు చేయాలి

### ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కలెక్టరేట్ దగ్గర ధర్నా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)**

ఒంగోలు మండలం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన తాటిపర్తి వెంకయ్యకి ప్రభుత్వం వారు 1992లో 40 సెంట్లు ప్రభుత్వ భూమి కేటాయించడం జరిగింది.దానిలో వారి కుమారులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.ఇటీవలే శ్రీ సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవి రమణారెడ్డి దళితుల భూమి పక్కన గల బిఈడి కాలేజీని కొనుగోలు చేయడం జరిగింది. ఇక్కడి నుంచి పక్కనే ఉన్న దళితుల భూమిని కబ్జా చేయాలని దురుద్దేశంతో ఎన్నో ప్రయత్నాలు చేయటం జరిగింది.గత ఏడాది తొమ్మిదవ నెలలో గ్రీవెన్స్ సెల్లో ఎస్పీ గారికి రమణారెడ్డి మీద కంప్లైంట్ ఇవ్వటం జరిగింది.తాలూకా సిఐ గారు కంప్లైంట్ విచారణ చేయకుండా కంప్లైంట్ దారుడు ఇంట్రెస్ట్‌గా లేడని కేసుని క్లోజ్ చేయడం జరిగింది. దీని మీద ఈరోజు మళ్లీ కలెక్టరేట్ ముందల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవి రమణారెడ్డిని వారి కుమారుని అరెస్టు చేయాలని ధర్నా చేసి కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ గారు,ఏపీ బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి ధరణికోట లక్ష్మీనారాయణ,గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం,బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ షేక్. అజీజ్ ,ఐ.ఎల్.పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సుందరం, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.ఆంజనేయులు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మిరియం అంజి బాబు కలల దండోరా రాష్ట్ర అధ్యక్షులు ఎ.ప్రసాద్ బిఎస్పి పార్టీ జిల్లా ఇంచార్జ్ ఏడు కొండలు , బీసీ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ గుంటూరు మస్తాన్ రావు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధికార ప్రతినిధి కడవకుదురు అంజిబాబు ఎమ్మార్పీఎస్ ఒంగోలు నియోజకవర్గం ఇంచార్జ్ తిరువీధుల బాబు, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు రాముడు, ఎమ్మార్ ఎమ్మార్పీఎస్ నాయకులు రాయపాటి మూర్తి, శరత్, తదితరులు పాల్గొన్నారు.

# 5వ డివిజన్ అధ్యక్షుడిని ప్రకటించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)**



నెల్లూరు 5వ డివిజన్ సత్యనారాయణపురంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరు అయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యకర్తలతో మాట్లాడారు. సానా సుబ్బారెడ్డిని 5వ డివిజన్ వైసిపి ఇన్‌చార్జ్ అధ్యక్షులు గాను ఇబ్రహీంను కోఆర్డినేటర్ గానూ ప్రకటించారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీ బలోపేతం దిశగా తామంతా కలిసికట్టుగా ఏకతాటిపై పనిచేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మంచి చేసే జగన్మోహన్ రెడ్డి



లాంటి ముఖ్యమంత్రిని ఎందుకు వదులుకున్నామని ఈరోజు ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని తెలిపారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఉన్న కమిట్మెంట్ కలిగిన లీడర్ జగన్మోహన్‌రెడ్డి ని అన్నారు. పార్టీకి కష్ట కాలంలో సేవలందించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. డివిజన్ ప్రజలతో చర్చించి సుబ్బారెడ్డిని 5వ డివిజన్ ఇంచార్జిగా, కోఆర్డినేటర్‌గా ఇబ్రహీంను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. వారికి సహకరిస్తూ డివిజన్ లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు.

## సర్వాంగ సుందరంగా పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డు

### మూడు నెలల్లో పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డు పనులు పూర్తి

### పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డు సి. సి డ్రైన్ లకు 90 లక్షల నిధులు విడుదల

### నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి






(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఏప్రిల్ 21)

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ సెంటర్‌లో సోమవారం రూ.36 లక్షల రూపాయలు వ్యయంతో సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కలిసి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డులో ఈ డ్రైన్ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఎక్కడా కూడా నీరు నిల్వ ఉండదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డులో సిసి డ్రైన్లకు మరో 90 లక్షల రూపాయల నిధులను కేటాయిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. బట్వాడి పాలెం సెంటర్ నుండి డైకాస్ రోడ్డు వరకు అత్యంత వేగవంతంగా సెంట్రల్ లైటింగ్, డ్రైన్ , రోడ్డు పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. మూడు నెలల లోపు పొదలకూరు రోడ్డు మెయిన్ రోడ్డును సర్వాంగ సుందరంగా చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్, కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ నాయకులు,జనసేన పార్టీ నాయకులు, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ హైస్కూల్లో ఘనంగా గ్రాడ్యుకేషన్ డే వేడుకలు






**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)**

కొండపి మండలం ఆనకర్లపూడిలోని శాంతినికేతన్ హైస్కూల్లో ఘనంగా గ్రాడ్యుకేషన్ డే వేడుకలు ఈ వేడుకలలో చిన్నారులు ఆటపాటలతో వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ కరస్పెండెంట్ మలసాని హరినాథ్ తెలిపారు. హ్యాండ్ రైటింగ్ కాంపిటీషన్లో మొదటి, ద్వితీయ స్థానాలు వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## పొదిలి ఏఎంసి ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాకు సత్కారం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఏప్రిల్ 21)**

పొదిలి ఏఎంసి ఛైర్మన్‌గా ఎంపికైన మాజీ ఎంపిటిసి సభ్యులు, ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ సయ్యద్ ఇమాం సాహెబ్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో స్థానిక షిరిడి సాయిబాబా సేవా సంఘం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కలువా సత్యనారాయణ, సామి రాజా, పేరం లక్ష్మీ నారాయణ, మేడా శ్రీనివాసులు, చావల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# నూతన సి.సి డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఏప్రిల్ 21)

కందుకూరు పట్టణంలోని 25వ వార్డు గాయత్రి నగర్ లో సోమవారం ఉదయం 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన సి.సి డ్రైన్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఈ శంకుస్థాన కార్యక్రమమునకు విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుకి వార్డు పార్టీ నాయకులు కార్యకర్తలు, కాంట్రాక్టర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ గణపతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు గుర్రం మాల్యాద్రి, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, కంద్రా మాల్యాద్రి పెంట్రాల సుబ్బారావు, గుర్రం మల్లికార్జున, బత్తిన వెంకయ్య, బత్తిన మాల్యాద్రి, చిట్టాబత్తిన మాలకొండయ్య, నవులూరి మాలకొండయ్య, పొడపాటి నాగేశ్వరరావు, రావూరి రామకోటయ్య, ముచ్చు వేణు, శ్రీహరి నాయుడు కాంట్రాక్టర్ కంద్రా నర్సయ్య, దివి శంకర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







# మా భూములు మేము ఇవ్వం మాజీ ఎంపీటీసీ మిరియం శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 21)

కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కరేడు ప్రాంతానికి సంబంధించిన రైతులు ప్రజలు ధర్నా చేశారు. ఈ ధర్నాకి మాజీ ఎంపీటీసీ మిరియం శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశ్రామికరణ కోసం సాగవంతమైన భూములను తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్నది. ఈ భూములు తీసుకోవడం వల్ల ఆ ప్రాంతంలో ఉన్న రైతులు ప్రజలు నష్టపోతారని, మా భూములు ఇవ్వము భూసేకరణ చేయొద్దని చెప్పేసి డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఐ గౌస్ మాట్లాడుతూ పారిశ్రామికరణ పేరుతోటి విలువైన భూములను కార్పొరేటు సంస్థలకి కట్టబెడుతుందని వారు వాటి మీద వ్యాపారం చేస్తున్నారని, గతంలో అనేక ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. ఇప్పటికీ కూడా ఆ భూ సేకరణ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలకి నిర్వాసితులకు రైతులకి ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ అమలు చేయలేదని, అందుకని భూసేకరణను పూర్తిగా ఆపాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్‌కి అర్జీ ఇచ్చారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మీరు ఇచ్చిన వినతి పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుంకాల రామ సుబ్బారెడ్డి, దారం శ్రీనివాసులు, రమణయ్య ,లింగారెడ్డి, రామకోటి రెడ్డి ,గంజి రామకోటయ్య, సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ , కందుకూరు పట్టణ సభ్యులు ఎస్.కె మున్వర్ సుల్తానా , సిపిఎం మాజీ కౌన్సిలర్ నాదెండ్ల కోటేశ్వరరావు, ఎస్ కే మల్లికా, ఎం పద్మ, ఎస్ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





# ముస్లిం మైనార్టీలకు టిడిపి ఎళ్ళవేళలా అండగా నిలుస్తుంది

## ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, ఎంపి మాగుంట




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 21)

తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీలకు అన్ని వేళలా అండగా ఉంటుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా నుండి హజ్ యాత్రకు వెళుతున్న 44 మందికి ఒంగోలులోని కూరగాయల మార్కెట్ వద్ద గల షాదిఖానాలో ఎంఎల్ఏ దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. హజ్ యాత్రకు వెళ్ళే వారికి దామచర్ల, మాగుంట స్వయంగా నోటిలో చుక్కల మందు వేశారు. హజ్ యాత్రికులకు దామచర్ల తన సొంత నిధులతో లగేజ్ బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా జరిగిన దువాలో దామచర్ల, మాగుంట పాల్గొన్నారు. అనంతరం హజ్ యాత్రికులను ఉద్దేశించి ఎం ఎల్ ఏ దామచర్ల మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీలకు అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. ముస్లింలకు సంబంధించిన సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తమ ప్రభుత్వం ముందు ఉంటుందని తెలిపారు. ఒంగోలు నుండి హజ్ యాత్రకు వెళ్ళే ముస్లిం మైనార్టీలకు కావలసిన సౌకర్యాలు తమ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఒంగోలు ఎంపీ మాగుంట మాట్లాడుతూ పవిత్ర హజ్ యాత్రకు వెళ్ళడం ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు చిరకాల కోరికగా ఉంటుందన్నారు. దైవ నిర్ణయం ఉంటేనే వెళుతుంటారని తెలిపారు. జిల్లా నుండి వెళుతున్న ముస్లిం సోదరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు కపిల్ బాషా, అజిమున్నిసా, అమృల్లా, ముస్లిం మత పెద్దలు అబిద్ మౌలానా, ముఫ్తీ అసద్, రియాజ్, జబ్బార్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకటనలకే పరిమితమైన స్వచ్ఛభారత్





(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ స్వచ్ఛ దినస్ కొండపిలో మాత్రం స్వచ్ఛభారత్ ప్రకటనలకే పరిమితమైంది. కొండేపి పంచాయతీలో సైడ్ కాలంలో పూడుక పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్న పట్టించుకోని పంచాయతీ అధికారులు. సైడ్ కాలువలు నిండా పిచ్చి మొక్కలు చెట్లు ప్లాస్టింగ్ వాటర్ బాటిళ్లతో కాలువలు అన్ని నిండిపోయి దోమలు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి సైడ్ కాలవలో కూడికలు తీసివేయాలని కొండపి ప్రజలు కోరుకుంటున్నారు.

# ఐరన్ లోపంతో రక్తహీనత సమస్య ఐసిడిఎస్ సూపర్వైజర్ విక్టోరియా రాణి




(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఏప్రిల్ 21)

ఐరన్ లోపం వలన రక్తహీనత సమస్యకు దారితీస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ విక్టోరియా రాణి అన్నారు. పోషణ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెన్నూరు అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగే పిల్లల్లో ఐరన్ శాతం తగ్గితే చికాకుగా ఉండడంతో పాటు దేని మీద ఏకాగ్రత పెట్టలేరని, జ్ఞాపక శక్తి మందగిస్తుందని తద్వారా చదువులోనూ వెనకబడే అవకాశం ఉంటుందని అన్నారు. పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన రక్తహీనత సమస్య అరికట్టవచ్చని ఆమె సూచించారు. అనంతరం చిన్న పిల్లలకు బరువు, ఎత్తు కొలతలను తీసుకుని గర్భిణీలకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.